యాదాద్రి జిల్లా మల్లాపురంలో బ్యాంకు ఖాతాలో రైతుభరోసా డబ్బులు పడుతాయని ఆశగా ఫోన్‌లో మెస్సేజ్ కోసం చూసుకుంటున్న రైతులు

భరోసాపై భంగపాటే!

మొదటిపేజీ తరువాయి...

చేయడంలో ఆలస్యం కారణంగా రైతు భరోసా ఇవ్వలేకపోతున్నట్టు వ్యవసాయ శాఖ వర్గాలు చెప్తున్నాయి. ఈ ప్రక్రియను పూర్తిచేసి, గ్రామాలవారీగా ఆయా భూములను ఫ్రీజ్(లాక్) చేసిన తర్వాతే రైతుభరోసా పంపిణీ ప్రారంభమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. గతంలో పనికిరాని భూములకు రైతుబంధు సాయం అందించారని, తాము ఆ భూములను రైతుభరోసా నుంచి తొలగిస్తామంటూ కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఏఈవోలు, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి వారం రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆ సర్వే పూర్తికాలేదని తెలిసింది. ఇంకా కొన్ని పట్టణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఇప్పటివరకు లెక్కతేలిన నిరూపయోగ భూమి 2 లక్షల ఎకరాలని, 3 లక్షల ఎకరాలని, 10 లక్షల ఎకరాలని అంటూ ప్రభుత్వం లీకులిస్తున్నది. అధికార లెక్క మాత్రం వెల్లడించలేదు. సర్వేలో గుర్తించిన పనికిరాని భూములను వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఈ డాటాను క్షేత్ర స్థాయిలో ఎమ్మార్వో, వ్యవసాయ అధికారి ధ్రువీకరించి ప్రభుత్వానికి పంపించాలి. దానిని ఉన్నతాధికారులు ఆమోదించాలి. ఆ తర్వాత ఆయా భూములను గ్రామాల వారీగా ఫ్రీజ్ చేయాలి. రైతుభరోసాకు అనుకూల, వ్యతిరేకత భూముల వివరాలను రెవెన్యూ శాఖ నుంచి వ్యవసాయ శాఖకు పంపించాలి. అప్పుడు వ్యవసాయ శాఖ ఆర్థికశాఖతో సమన్వయం చేసుకొని రైతుభరోసా డబ్బులు విడుదలచేయాలి.

రైతుల ఆశలు ఆవిరి

కాంగ్రెస్ సర్కారు వానకాలం రైతుభరోసాను ఎగ్గొట్టింది. ఈ యాసంగికైనా రైతుభరోసా వస్తుందో రాదో అనే ఆందోళన రైతుల్లో నెలకొన్నది. ఈ నెల 26న రైతుభరోసా ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆశగా ఎదురుచూశారు. చివరకు నిరాశే మిగిలింది. బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా తొలిరోజు ఎకరం రైతులకు రైతుభరోసా జమ చేసి ఉంటే, 22.55 లక్షల మంది రైతులకు రైతుభరోసా జమ అయ్యేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 4.41 లక్షల మందికి మాత్రమే రైతుభరోసా జమ చేసింది. మిగిలిన 18.14 లక్షల మంది రైతులకు తొలిరోజు రైతుభరోసా జమ కాలేదు. దీంతో 26న రైతుభరోసా నిధులు వస్తాయని ఎదురుచూసిన ఎకరం లోపు రైతులకు నిరాశే ఎదురైంది.

రెండు నెలలు ఆగాల్సిందేనా?

ఆదివారం 2 పథకాల ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పథకాలను మార్చి 31 వరకు పూర్తిచేస్తామని ప్రకటించారు. సీఎం వ్యాఖ్యల వెనుక భారీ ప్లాన్ ఉన్నదని, 4 పథకాలను ఇప్పట్లో అమలుచేయడం కష్టమేననే విషయాన్ని పరోక్షంగా చెప్పారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రైతుభరోసాను కూడా రైతులందరికీ పంపిణీ చేయడానికి మార్చి 31 వరకు సమయం తీసుకుంటారనే చర్చ జరుగుతున్నది. దీంతో రైతులు రైతుభరోసా కోసం మరో రెండు నెలలు ఎదురుచూడక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

మాకేది రైతు రుణమాఫీ?

- కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది
- కరీంనగర్, జగిత్యాల ప్రజావాణిలో పెద్ద సంఖ్యలో రైతుల మొర
- కలెక్టర్లకు వినతిపత్రాలు

రైతు రుణమాఫీ కోసం జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చిన లక్ష్మీపూర్ రైతులు

జగిత్యాల, జనవరి 27 (నమస్తే తెలంగాణ)/ కరీంనగర్ కలెక్టరేట్: రుణమాఫీ కోసం రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అటు వ్యవసాయ అధికారులు, ఇటు బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోతున్నారు. ఎన్నికల ముందు రైతులందరికీ రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొర్రీలు పెట్టి తమ పొట్టకొట్టిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వందశాతం చేశామని చెప్తున్నా, అందులో ఏ మాత్రం నిజం లేదని అంటున్నారు. తమకు అన్ని అర్హతలున్నా ఎగనామం పెట్టిందని కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో చాలా మంది రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం ఆయా జిల్లాల కలెక్టరేట్లలో జరిగిన ప్రజావాణికి తరలివచ్చి రుణమాఫీపై ఏకరవు పెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు జాబితాల్లో తమ పేర్లు రాలేదని, అప్పటి నుంచి అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే తమకు రుణమాఫీ చేయాలని కోరుతూ కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు.

నాసోంటి గోస ఎవరికీ రావొద్దు..

నాకు రెండెకరాల పొలం ఉంది. నేను పైడిమడుగు ఇండియన్ బ్యాంక్ బ్రాంచిలో రూ.1.10 లక్షలు పంట రుణం తీసుకున్న. ఏటా రెన్యువల్ చేసుకుంటున్న. వడ్డీ చెల్లించిన. కానీ నాకు రుణమాఫీ కాలేదు. మూడు జాబితాల్లోనూ నా పేరు రాలేదు. ఆఖరి లిస్టులోనూ పేరు లేకుండాపోయింది. వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారుల వద్దకు, కలెక్టరేట్‌కు తిరిగి తిరిగి రేగాళ్లు పడ్డాయి. కానీ లోన్ మాత్రం మాఫీ కాలేదు. ఏ అధికారిని అడిగినా సప్పుడు చేత్తలేడు. మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన. నాసోంటి గోస ఎవరికీ రావద్దు.

- పాలడుగు గంగారాం, మైతాపూర్, రాయికల్ మండలం

మాఫీ కోసం తిరిగి తిరిగి యాష్టకచ్చింది..

నాలుగేండ్ల కింద కొత్తపల్లి యూనియన్ బ్యాంకులో రూ.88 వేల రుణం తీసుకున్న. ఎలక్షన్లకు ముందు రుణమాఫీ చేస్తమని కాంగ్రెసోళ్లు అంటే సంబురపడి ఓట్లేసినం. రెండు నెలల కింద రుణమాఫీ మొదలైందంటే, మాకు కూడా అయితదని అనుకున్నం. నాలుగుసార్లు లిస్టు పెట్టిండ్లు. ఒక్క లిస్టులో కూడా నాపేరు లేదు. బ్యాంకోళ్ల దగ్గరికి పోయి అడిగితే, వ్యవసాయాధికారిని అడుగాలే అన్నరు. ఆయననడిగితే బ్యాంకొల్లనే అడుగాలే అంటండ్లు. వాళ్లిద్దరి దగ్గరికి తిరిగి తిరిగి యాష్టకచ్చి కలెక్టరమ్మనన్న కలిసి నా బాధ చెప్పుకుందామని వచ్చిన.

- భక్తి చంద్రయ్య, మల్లన్నపల్లి గ్రామం, చొప్పదండి మండలం

ఏసీబీకి చిక్కిన ఏఈ కృష్ణ

ట్రాన్స్‌ఫార్మర్ కోసం 20 వేలు లంచం

ఏసీబీకి చిక్కిన మనోహరాబాద్ ఏఈ

మనోహరాబాద్, జనవరి 27 : ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం విద్యుత్తు శాఖ ఏఈ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని ఓ పరిశ్రమ నిర్వాహకుడు ఎల్టీ క్యాటగిరీ-3 కింద 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు పెట్టుకున్నాడు. ఇందు కోసం ఏఈ సీహెచ్ కృష్ణ రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. ముందుగా రూ.10 వేలు తీసుకున్నాడు. సదరు పరిశ్రమ యజమాని నుంచి సోమవారం మిగితా రూ.20 వేలను ఏఈ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు ఏఈ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు.

18,180 మందికి ఆత్మీయ భరోసా

- మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 18,180 మంది ఉపాధిహామీ కూలీలకు ఒక్కొక్కరికి రూ.ఆరు వేల చొప్పున ఆత్మీయ భరోసా అందజేసినట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం వారి ఖాతాల్లో నగదు జమ చేశామని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ సర్కారు రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఉపాధిహామీ కూలీలకు ఆర్థిక సాయం అందించడం చరిత్రాత్మకమని చెప్పారు.

మండలానికో గ్రామంలో రైతుభరోసా

577 గ్రామాల్లో 569 కోట్లు జమ:మంత్రి తుమ్మల

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): తొలి విడతలో భాగంగా ప్రతి మండలంలో ఒక గ్రామం చొప్పున రైతుభరోసా నిధులను సోమవారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నాలుగు పథకాలను

తొలిరోజు రైతుభరోసా

మండలాలు	563
గ్రామాలు	577
రైతుల సంఖ్య	4,41,911
విస్తీర్ణం (ఎకరాల్లో)	9,48,333
జమ చేసిన మొత్తం	రూ.569 కోట్లు

ప్రారంభించిన పైలట్ గ్రామాల్లో రైతుభరోసా నిధులను జమ చేసినట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 563 మండలాల్లోని 577 గ్రామాల్లో 4,41,911 మంది రైతులకు సంబంధించిన 9,48,333 ఎకరాల భూమికి రూ.569 కోట్లు జమచేసినట్టు వివరించారు. ఎన్నికల హామీలో భాగంగా పంట పెట్టుబడి సహాయాన్ని పెంచి రైతుభరోసా పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ రైతుభరోసా అందజేస్తామని చెప్పారు.

పల్లీకి గిట్టుబాటు ధర కల్పించాలని కల్వకుర్తిలో ఆందోళన చేస్తున్న రైతులు

పల్లి ధరపై లొల్లి

మొదటిపేజీ తరువాయి...

ఒక్కసారిగా రూ.3 వేలు తగ్గించడంతో రైతులు ఆగ్రహానికిగురై అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతటి రజిత భర్త అంతటి మల్లేశ్ మాట్లాడుతుండగా ఆగ్రహానికి గురైన రైతులు ఆయనపై దాడిచేశారు. అంగీపట్టి లాగడంతో పూర్తిగా చినిగిపోయింది. అధికారులు, సిబ్బంది భయాందోళనతో కార్యాలయంలోకి పరుగెత్తగా.. వారిని వెంబడించారు. సెక్రటరీ నర్సింహులుపై దాడి చేశారు. కార్యాలయంలోన్లి ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశారు. ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. అక్కడి నుంచి రైతులు పెద్ద సంఖ్యలో అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఎస్సై రమేశ్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి వారిని మార్కెట్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చెమటోడ్చి, పండించిన పంటను అమ్ముదామని మార్కెట్‌కి తీసుకొని వస్తే వ్యాపారులు నాణ్యతను పరిశీలించకుండా ఇష్టమొచ్చిన రేటు నిర్ణయిస్తూ తూకాల్లో మోసాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రైతుకు చెందిన ఒకే పొలంలో పండిన పంటను రెండు కుప్పలు పోయగా ఒకే పంటకు రెండు రేట్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. మార్కెట్‌లో జరుగుతున్న మోసాలను అరికట్టి న్యాయం జరిగే వరకు కొనుగోళ్లు నిలిపి వేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు దిగివచ్చి రైతులకు న్యాయం జరిగేవిధంగా చూడాలని రైతులు డిమాండ్ చేశారు.

కల్వకుర్తిలోనూ ఆందోళన

పల్లీ పంటకు మద్దతు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం వారు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు వివిధ గ్రామాల రైతులు పల్లీలను విక్రయానికి తీసుకురాగా వ్యాపారులు సరైన ధరను టెండర్ చేయకపోవడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ చౌరస్తాకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇతర మార్కెట్ యార్డుల్లో పల్లీకి మద్దతు ధర దాదాపుగా రూ.7,500 ఉండగా కల్వకుర్తిలో మాత్రం రూ.5,400 ఎలా చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. వ్యాపారులు తమను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు తమకు న్యాయం చేయాలని, లేదంటే రీ టెండరింగ్ వేయాలని డిమాండ్ చేశారు. వెల్దండ సీఐ, కల్వకుర్తి పోలీసులు, వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సభ్యులు రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. అదేసమయంలో మార్కెట్ యార్డుకు చేరుకున్న రాష్ట్ర వ్యవసాయ కమిటీ సభ్యుడు కేపీఎన్ రెడ్డి రైతులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా 'సీఎం డౌన్‌డౌన్.. వద్దురా వద్దురా కాంగ్రెస్ పాలన వద్దురా'.. అంటూ రైతులు నినదించారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్య!

- జాబితాలో పేరు లేదని ఉరేసుకున్న యువకుడు
- కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటలో ఘటన
- లిస్ట్‌లో కొడుకు పేరు రాలేదని తండ్రి మనస్తాపం
- సొంతింటి కల నెరవేరదేమోనని ఆగిన గుండె
- ప్రత్యేక' పాలన మొదలైన రోజే ఉద్యోగి అవినీతి

ఒకే ఇంటి నంబర్‌పై నలుగురికి ఇండ్ల మంజూరు

జనగామలో కలెక్టర్‌కు ఇంటి యజమాని ఫిర్యాదు

కాల్వశ్రీరాంపూర్: ఎన్నో ఆశలతో ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో తన పేరు రాలేదని ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా కిష్టంపేటలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. గ్రామానికి చెందిన పురుషోత్తం ప్రభాకర్ (45), రమ భార్యభర్తలు. పూరి గుడిసెలోనే ఉంటూ బతుకీడుస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. రమకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇటీవల తన తల్లిగారింటికి వెళ్లింది. అర్హుల జాబితాలో వీరి పేరు రాకపోవడంతో మనస్తాపం చెందిన ప్రభాకర్, ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కాల్వశ్రీరాంపూర్ దవాఖానకు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. ప్రభాకర్ తల్లి మధునమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రానందునే తన భర్త కలత చెంది ఉరేసుకొని చనిపోయాడని పెద్దపల్లి దవాఖాన వద్ద అతడి భార్య రమ కన్నీటి పర్యంతమైంది. తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నది.

ఇల్లు రాదేమోనని ఆగిన గుండె

చాట్ల కృష్ణయ్య (ఫైల్)

ఖమ్మం రూరల్: ఇందిరమ్మ ఇల్లు ఇక రాదేమోనని ఓ తండ్రి గుండె ఆగిపోయింది. ఖమ్మం జిల్లాలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అర్హుల జాబితాను వెల్లడించింది. జాబితాల్లో అన్నీ అనర్హుల పేర్లే ఉండటం, అర్హులు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. చివరికి నామమాత్రంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అయితే, అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవడం, అనర్హుల పేర్లే ఉండడంతో పేదలు తీవ్ర మనోవేదనకు లోనవుతున్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో ఈ నెల 23న జరిగిన గ్రామసభలో తన కొడుకు రాము పేరు ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో రాలేదని తండ్రి చాట్ల కృష్ణయ్య (62) మనస్తాపానికి గురయ్యాడు. అప్పటి నుంచి నలతగా ఉంటున్న కృష్ణయ్య ఆదివారం రాత్రి గుండెపోటుతో చనిపోయాడు. మాజీ సర్పంచ్ సిద్ధినేని కోటయ్య, సీపీఎం నాయకుడు తమ్మినేని కోటేశ్వరరావు వచ్చి కృష్ణయ్య మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. నిరుపేద కృష్ణయ్య కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

లిస్ట్‌లో పేరు ఎక్కించేందుకు లంచం.. ఏసీబీకి దొరికిన వార్డు అధికారి

సత్తుపల్లిటౌన్: ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితాలో పేర్లు ఎక్కించేందుకు లంచం డిమాండ్ చేసిన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపల్ వార్డు అధికారి నల్లటి వినోద్‌కుమార్ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. సత్తుపల్లి పట్టణంలోని 23వ వార్డుకు చెందిన ఓ మహిళ వద్ద వార్డు అధికారి వినోద్‌కుమార్ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు కావాలంటే తనకు రూ.3 వేలు ఇస్తే లిస్టులో పేరు వచ్చేలా చేస్తానని తెలిపాడు. దీంతో ఆ మహిళ ఖమ్మం ఏసీబీ కార్యాలయానికి నేరుగా వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏసీబీ అధికారులు సత్తుపల్లిలో ఈ నెల 25న రెక్కీ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం పాత సెంటర్‌లోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ పక్కన ఉన్న జ్యూస్ సెంటర్ వద్దకు వచ్చి నగదు ఇవ్వాలని సదరు ఉద్యోగి మహిళకు చెప్పడంతో ఆ మహిళ ఏసీబీ అధికారులు కెమికల్ కలిపి ఇచ్చిన రూ.2500 వార్డు అధికారికి ఇచ్చింది. అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ వై రమేశ్ తన సిబ్బందితో సదరు ఉద్యోగిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వినోద్‌కుమార్‌ను వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం ఈ నెల 26న ముగిసిపోయి ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నది. ప్రత్యేక అధికారి పాలన మొదటి రోజునే ఇలా జరగడంతో అధికారుల పాలనలో జవాబుదారీతనం ఎలా ఉంటుందోనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఒకే ఇంటి నంబర్.. నలుగురికి ఇండ్లు

జనగామలో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఇంటి యజమాని పొన్నాల జగత్ కుమార్

జనగామ చౌరస్తా: ఒకే ఇంటి నంబర్‌పై నలుగురికి ఇండ్లు మంజూరైన విషయం జనగామలో సోమవారం వెలుగుచూసింది. మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజల్లో విస్మయం వ్యక్తమవుతున్నది. జనగామ పట్టణంలోని 26వ వార్డు గణేశ్ వాడ ఏరియాకు చెందిన పొన్నాల నాగరాణి-జగత్ కుమార్ దంపతులు 35 ఏండ్లుగా 3-6-14 నంబర్ ఇంటిలో నివాసముంటున్నారు. వీరి ఇంటి నంబర్‌తో పాటు మూడు బై నంబర్లపై ఎర్ర రూప, జీ సృజన, కూచన సునీత, కొమురాలి భాగ్యలక్ష్మికి అధికారులు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. నలుగురి ఆధార్ కార్డులపై ఇదే ఇంటి నంబర్‌తో అడ్రస్ ఉన్నట్టు తెలిసింది. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సదరు ఇంటి యజమాని జగత్ కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన ఇంటి నంబర్ నుంచి ఆ నలుగురి అడ్రస్ మార్చాలని కోరారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరపాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశిస్తూ కలెక్టర్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదు చేసిన ఇంటి యజమాని జగత్ కుమార్ స్థానిక కాంగ్రెస్ నాయకుడు కావడం విశేషం.

- మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఏండ్లు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆరోపిస్తూ సోమవారం భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నాకు దిగారు. కనీస వేతనాలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు, బిల్లులు చెల్లించాలని, వంటశాలల్లో సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. -కొత్తగూడెం, గణేశ్ టెంపుల్

ఇందిరమ్మ ఇల్లు రాకపోతే చంపేస్తా!

- పంచాయతీ కార్యదర్శికి కాంగ్రెస్ కార్యకర్త బెదిరింపు
- ఎకరం అమ్మి అయినా నిన్ను చంపుతానని హెచ్చరిక
- వరంగల్ జిల్లా వాంకుడోతు తండాలో ఘటన

రాయపర్తి, జనవరి 27: ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం కాంగ్రెస్ కార్యకర్త ఏకంగా గ్రామ కార్యదర్శిని బెదిరించాడు. తనకు ఇల్లు రాకపోతే అవసరమైతే ఎకరం పొలం అమ్మి అయినా సరే చంపుతానంటూ ఫోన్‌చేసి భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం వాంకుడోతు తండా గ్రామ పంచాయతీలో ఈనెల 24న పంచాయతీరాజ్ ఏఈ తాళ్ల శ్రీప్రియ సారథ్యంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాను పంచాయతీ కార్యదర్శి కీర్తి అభిలాష్ చదివి వినిపించారు. ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త వాంకుడోతు రవీందర్ ఈనెల 25న పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు ఎందుకు లేదని ప్రశ్నించాడు. 'నాకున్న వ్యవసాయ భూమిలో ఎకరం అమ్మి అయినా సరే నిన్ను చంపి తీరుతా' అంటూ బెదిరించాడు. బాధితుడు అభిలాష్ గ్రామ పంచాయతీ కార్యదర్శులందరితో కలిసి ఈనెల 26న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

- 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన'

ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే)లో ఫ్లెక్సీ, ప్రకార్డులతో గ్రామస్థుల నిరసన

ఇచ్చోడ, జనవరి 27: 'వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన.. వద్దురా నాయనా రేవంత్‌రెడ్డి పాలన' అంటూ ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే) గ్రామస్థులు ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. నాలుగు పథకాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి, మండలానికి ఒక గ్రామంలోనే అమలు చేయడం అన్యాయమని మండిపడ్డారు. మిగిలిన గ్రామాల ప్రజలు ఓట్లు వేయలేదా? అని ప్రశ్నించారు. 'రేవంత్‌రెడ్డి నువ్వు రాష్ట్రానికి ముఖ్యమంత్రివా? లేక మండలంలోని ఒక గ్రామానికేనా?' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రజలకు రైతుభరోసా, రుణమాఫీ, తులం బంగారం, మహాలక్ష్మి పింఛన్, రూ.2 లక్షల ఉద్యోగాలు ఇలా అన్నీ బాకీ ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు గంగలో కలిశాయని మండిపడ్డారు.